# సూర్యాపేటలో భారీగా గుట్కా సీజ్

- రూ.10 లక్షల విలువైన ప్యాకెట్లు పట్టుకున్న పోలీసులు
- నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ రాజశేఖర్


సూర్యాపేటలోని మంజూ బేకరీ అండ్ కిరాణ షాప్‌లో భారీగా దొరికిన నిషేధిత గుట్కా ప్యాకెట్ల బస్తాలు

సూర్యాపేట టౌన్, జూలై 14 : జిల్లా కేంద్రంలో రూ10.లక్షలు విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను ఆదివారం సీఐ రాజశేఖర్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టి సీజ్ చేశారు. ఇటీవల నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'యథేచ్ఛగా గుట్కా దందా' శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన పోలీస్ యంత్రాంగం అప్పటి నుంచి తనిఖీలు చేపడుతూనే ఉన్నారు. పలుచోట్ల లక్షల రూపాయల విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను ఇప్పటికే సీజ్ చేయగా.. తాజాగా ఆదివారం ఒక్కరోజే రూ.10 లక్షల విలువ చేసే గుట్కాను పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లోని మంజూ బేకరీ అండ్ కిరాణ హోల్‌సేల్ షాపులో నిషేధిత గుట్కాలు భద్రపర్చారని పక్కా సమాచారం రావడంతో పోలీసులు దాడులు జరిపి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బేకరీ యజమాని శివ మీద కేసు నమోదు చేసి ప్యాకెట్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఇప్పటి వరకు సీజ్ చేసిన గుట్కాల వివరాలను త్వరలో ప్రెస్ మీట్ పెట్టి వివరిస్తానని పేర్కొన్నారు. నిషేధిత గుట్కాలను ఎవరు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా విక్రయిస్తున్నారని తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# మురుగును తొలగించండి మహాప్రభో!

- చిలుకూరు ప్రజల ఆవేదన


చిలుకూరులోని ఓ వీధిలో మురుగునీటితో నిండిన కాల్వ


చిలుకూరు, జూలై 14 : మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాల్వల్లో పూడిక తీయకపోవడంతో చెత్త పేరుకుపోయి నీరు అలాగే నిల్వ ఉంటుంది. అధికారులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రకటనలు చేయడం తప్ప ఆచరణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల అందులో దోమలు చేరి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మండలంలో అత్యధిక మంది డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడి నరకయాతన అనుభవించారు. ఈ ఏడాది కూడా అలా జరుగక ముందే కాల్వలు శుభ్రం చేసి, దోమల నివారణ మందు చల్లాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.


ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్‌లో పిల్లలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

# హాస్టళ్లను తనిఖీ చేసిన ఆర్డీఓ

బొడ్రాయిబజార్, జూలై 14 : కలెక్టర్ తేజస్ నందలాల పవార్ ఆదేశాల మేరకు సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవరావు జిల్లా కేంద్రంలోని పలు హాస్టళ్లను ఆదివారం ఆకస్మిక రాత్రి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని అఫ్జల్ రైస్ మిల్ వెనుక గల ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్, నెహ్రూనగర్‌లోని ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యాపేట మహిళకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న దీపారాణి

బొడ్రాయిబజార్, జూలై 14 : జిల్లా కేంద్రంలోని 45వ వార్డుకు చెందిన అనంతుల దీపారాణి విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో సీఎస్ఐ విభాగంలో ప్రొఫెసర్ వి.లక్ష్మి నేతృత్వంలో ఏఐ/ఎంఎల్‌తో అల్జీమర్ రోగ నిర్ధారణపై చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ సాధించారు. ఈ సందర్భంగా బెంగుళూరు గీతం యూనివర్సిటిలో జరిగిన స్నాతకోత్సవంలో వందే భారత్ ట్రైన్ సృష్టికర్త సుధాంశల మణి చేతుల మీదుగా ఆమె ఆదివారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు.


ఎమ్మెల్యే సామేల్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్

## ఎమ్మెల్యే సామేల్‌కు సీఎం శుభాకాంక్షలు

తిరుమలగిరి, జూలై 14 : ఎమ్మెల్యే మందుల సామేల్ తన జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరం


పెదవీడు గ్రామంలో ఉచితంగా నిర్వహించిన క్యాన్సర్ వైద్య శిబిరం

మఠంపల్లి, జూలై 14 : సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సిబ్బంది నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ఆదివారం మండల పరిధిలోని పెదవీడు గ్రామంలో కొనసాగింది. సుమారు 270 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సాగర్‌సిమెంట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణామూర్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుచర్లలో అభివృద్ధి పనులు ప్రారంభం


మున్సిపాలిటీలో సాగుతున్న రోడ్డు పనులు

నేరేడుచర్ల, జూలై 14 : మున్సిపాలిటీలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రెండేండ్ల క్రితం ప్రారంభమైన పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ నూతనంగా ఏర్పాటు కావడంతో గత ప్రభుత్వం రూ.కోట్ల నిధులను విడుదల చేసి అభివృద్ధి పనులను ప్రారంభించింది. అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, దీనికి తోడు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ఆగిపోయాయి. ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి మంజూరైన రూ.15 కోట్లతో జాన్‌పహాడ్ రోడ్డు, రామాపురం, పాత నేరేడుచర్ల రహదారుల విస్తరణ పనులు ప్రారంభించారు. అవసరమైన మేరకు దుకాణాలను తొలగించి, మురుగు కాల్వలను నిర్మించి రహదారికి ఇరువైపులా కంకర పోసి తారు రోడ్డు వేయకుండా వదిలేశారు. గత వారం మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేరేడుచర్లలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలో పత్రికా విలేకరులు సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా.. ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి తక్షణమే పనులు ప్రారంభించి త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్లు ముందు రోడ్డు పనులను ముమ్మరం చేశారు.

# నేటి సెక్రటేరియట్ ముట్టడికి టీఎస్పీ మద్దతు


మాట్లాడుతున్న టీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

బొడ్రాయిబజార్, జూలై 14 : విద్యార్థి, నిరుద్యోగ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న సెక్రటేరియట్ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిద్ధ రామయ్య సమక్షంలో ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ అమలు చేయకపోవడం బీసీలను అవమానించడమేనన్నారు. నెల రోజులుగా నిరుద్యోగులు రోడ్లెక్కి ఉద్యమాలు చేస్తుంటే వారికి రాజకీయ రంగు పులిమి దుర్భాషలాడడం సరికాదని మండి పడ్డారు. డీఎస్సీ వాయిదా, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ అన్నారు. నేడు నిర్వహించే సెక్రటేరియట్ ముట్టడిని విద్యార్థి సంఘాలు, బీసీ నాయకులు, సామాజిక ఉద్యమకారులు, నిరుద్యోగులు కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు వర్రె ఆంజనేయులు, నాగరాజు, శ్రవణ్, పరుశరాం, సంజయ్, శివ, మహేశ్, నరేశ్, సాయి, రమేశ్, విక్రమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరెడ్డికి నివాళి

పాలకవీడు, జూలై 14 : మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు మలిగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ నాయకులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మహిళా సంఘం నాయకులు మంగమ్మ పాల్గొన్నారు.

# పాత సూర్యాపేటలో పీఓడబ్ల్యూ సభ్యత్వ నమోదు

ఆత్మకూర్.ఎస్, జూలై 14 : పీఓడబ్ల్యూ (ప్రగతిశీల మహిళా సంఘం) సభ్యత్వాలను ఆదివారం పాత సూర్యాపేట గ్రామంలో నమోదు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు సామ ఉపేంద్ర మాట్లాడుతూ దేశంలో మహిళలు అభద్రతా భావానికి గురవుతున్నారని, వారికి సరైన రక్షణ లేకపోగా హక్కులను హరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు ఎడవెల్లి సుగుణమ్మ, జ్యోతి, వీరమ్మ, సుందారపు మరియమ్మ, మమత, నాగలక్ష్మి, తలకొప్పుల ఎల్లమ్మ పాల్గొన్నారు.


శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

# మెకానిక్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం

బొడ్రాయిబజార్, జూలై 14 : పట్టణంలోని గాయత్రి ట్రాక్టర్ మెకానిక్ షెడ్డులో పనిచేస్తున్న కందాల శ్రీనివాస్‌రెడ్డి(34) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. సూర్యాపేట ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు కలిసి రూ.లక్ష సేకరించి ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రాందేని ఆదినారాయణ మాట్లాడుతూ మెకానిక్‌లు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అక్బర్, ప్రధాన కార్యదర్శి పల్స మహేశ్, కోశాధికారి అనిల్, గౌరవ సలహాదారుడు రాయపాటి శ్రీను, కుంచారపు నాగిరెడ్డి, యూసుఫ్‌ఖాన్, బందనాదం రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ఉండ్రుగొండలో స్వాతీ నక్షత్ర కల్యాణం

చివ్వెంల, జూలై 14 : మండల పరిధిలోని ఉండ్రుగొండ గుట్టల్లో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నేడు స్వాతీ నక్షత్ర కల్యాణం శ్రీమాన్ ఆరుట్ల రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చకిలం కృష్ణకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పీర్ల ఊరేగింపు


పెంచికల్‌దిన్నెలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నేరేడుచర్ల, జూలై 14 : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో ఈ నెల 17న జరిగే మొహర్రం పండుగ సందర్భంగా ఆదివారం పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా పీర్లను అలంకరించి చావిడి వద్దకు తీసుకొచ్చి వీధుల వెంట డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా వీరయ్య


బయ్య వీరయ్య

మోతె, జూలై 14 : మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్ల సంఘం మండలాధ్యక్షులుగా రాఘవపురం గ్రామానికి చెందిన బయ్య వీరయ్యను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా మద్ది మధు, ప్రధాన కార్యర్శిగా బద్రి, సభ్యులుగా శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, రాంబాబు, గిరిబాబు ఎన్నికయ్యారు.

## రైతాంగ సమస్యలపై ఉద్యమించండి : ఏఐకేఎంఎస్

బొడ్రాయిబజార్, జూలై 14 : బీజేపీ రైతు వ్యతిరేక విధానాలపై, రైతాంగ సమస్యలపై ఉద్యమించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, కాకి మోహన్‌రెడ్డి, ఉదయగిరి, కునుకుంట్ల సైదులు, వి.నర్సింహారావు, పోలెబోయిన కిరణ్, దేశోజు మధు పాల్గొన్నారు.

# 'ఎందుకు సోషలిస్టు విప్లవం?' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, జూలై 14 : గజిల్లా కేంద్రానికి చెందిన షేక్ అబ్దుల్ కరీం రచించిన ఎందుకు సోషలిస్టు విప్లవం? పుస్తకాన్ని ప్రజా వైద్యుడు డాక్టర్ కె.రంగారెడ్డి ఆదివారం స్థానిక సిద్ధార్థ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు రావడం నేడు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య, ప్రొఫెసర్ ఎ.పున్నయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.యోగానంద్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమళ్ల హసేన్, తెలంగాణ ఉద్యమకారులు సీహెచ్.రమణాచారి, సీపీయూఎస్ఐ నాయకులు చామకూరి నర్సయ్య, నల్లెడ మాధవరెడ్డి, పేర్ల నాగయ్య, గుండు వెంకన్న, నాగేందర్‌నాయక్, నారబోయిన వెంకట్, స్వామి, కోటయ్య పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయం నిర్మాణం పూర్తి


నిర్మాణం పూర్తయిన అయ్యప్ప స్వామి ఆలయం

నేరేడుచర్ల, జూలై 14 : పట్టణంలోని శ్రీవిజయదుర్గ ఆలయ సమీపంలో సుమారు రూ.కోటి రూపాయల విరాళాలు సేకరించి నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణం పూర్తయింది. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొణతం కృష్ణారెడ్డి ఆలయ నిర్మాణానికి 14 గుంటల స్థలం ఉచితంగా ఇచ్చారు. పండితులు ఇరువంటి వెంకటరమణ శర్మ, సత్యనారయణ శర్మ, కిశోర్ శర్మ ఆధ్వర్యంలో ఆగస్టు 17, 16, 19 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే పట్టణంలో శివాలయం, సాయిబాబ, విజయదుర్గ, వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉండగా ఇటీవల నూతనంగా కోదండ రామాలయాన్ని నిర్మించి వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రస్తుతం అయ్యప్ప స్వామి ఆలయం కడా సిద్ధం కావడంతో నేరేడుచర్ల ఆధ్యాత్మికతను సంతరించుకున్నది.

# కొండ నర్సయ్య జీవితం స్ఫూర్తిదాయకం : సీపీఎం


స్మారక స్తూపం వద్ద మాట్లాడుతున్న కొండ భాస్కర్

మోతె, జూలై 14 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు కొండ నర్సయ్య జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఎం గ్రామ కార్యదర్శి కొండ భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని బుర్కచర్ల గ్రామంలో ఆదివారం నర్సయ్య మూడో వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపం వద్ద జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు కొండ రాములు, పంతంగి గోపాల్, ఇరుగు కృష్ణానందం, పేరెంది వీరయ్య, జెర్రిపోతుల లక్ష్మమ్మ, కొండ శ్రీరాములు, అచ్చాలు, రామచంద్రు, కొండ వెంకన్న పాల్గొన్నారు.


## డీఎస్సీని 45రోజులు వాయిదా వేయాలి : నాగయ్య

బొడ్రాయిబజార్, జూలై 14 : రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీని 45రోజులకు వాయిదా వేసి 25వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ప్రకటించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరుస పోటీ పరీక్షలు వస్తుండగా నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని, గ్రూప్2 పరీక్షలు కూడా వాయిదా వేయాలని పేర్కొన్నారు. 15 రోజులుగా సచివాలయం ఎదుట నిరుద్యోగులు పోటీ పరీక్షలు వాయిదా వేయాలని చేస్తున్న ఆందోళన ప్రభుత్వానికి కనబడుట లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులను మాఫియాతో పోల్చడం అవకాశవాదానికి నిదర్శనమని చెప్పారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సేవాలాల్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడిగా జానునాయక్

మేళ్లచెర్వు, జూలై 14 : సేవాలాల్ హుజూర్‌నగర్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడిగా భూక్యా జానునాయక్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ధరావత్ రవీందర్ నాయక్ ఆదివారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా జాను నాయక్ మాట్లాడుతదూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ సేన కన్వీనర్ శ్రీను నాయక్, నాగు నాయక్, హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు.

# సీత్లా పండుగ


కల్మెట్‌తండాలో శీత్లా పండుగను నిర్వహిస్తున్న గిరిజనులు

పాలకవీడు, జూలై 14 : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని కల్మెట్ తండాలో గిరిజనులు సీత్లా పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీత్లా అమ్మవారికి నైవైద్యం సమర్పించడంతో పాటు గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్, మేరమాయాడీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి కేశావత్ మధునాయక్, గ్రామస్తులు రూపావత్ బాలూనాయక్, లక్పతినాయక్, మాజీ ఎంపీటీసీ విజయవెంకట్, ధరావత్ బాల్‌సన్ నాయక్, హేమానాయక్, భరత్‌నాయక్ తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

సూర్యాపేట రూరల్, జూలై 14 : మండల పరిధిలోని టేకుమట్ల గ్రామ స్టేజీ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ కొంతకాలంగా కేతేపల్లి మండల ఉప్పల పహాడ్ బస్ స్టాప్ వద్ద గల గుడి వద్ద ఉంటున్నది. ఆదివారం ఉప్పలపహాడ్ నుంచి టేకుమట్ల వైపునకు నడుచుకుంటూ వస్తుండగా అదే మార్గంలో వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ బైక్ వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టింది. దీంతో మహిళ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించినట్లు రూరల్ ఎస్ఐ బాలూనాయక్ తెలిపారు. మహిళ సమాచారం తెలిసిన వారు 8712686030 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ముక్కంటి మృతి తీరని లోటు : లక్ష్మయ్య

గరిడేపల్లి, జూలై 14 : మండలంలోని వెలిదండ గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు వీసాల ముక్కంటి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. వెలిదండలో ఆదివారం జరిగిన ముక్కంటి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి ముక్కంటి అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి మేకల కనకారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, నాయకులు శ్రీను, అరుణోదయ జిల్లా నాయకుడు గుండు నాగేశ్వర్‌రావు, నాయకులు పర్వతాలు, మత్తయ్య, అంజయ్య పాల్గొన్నారు.

# ముత్యాలమ్మకు బోనాలు


మఠంపల్లి : బొడ్రాయికి పూజలు చేస్తున్న మహిళలు

తుంగతుర్తి, జూలై 14 : మండల పరిధిలోని వెంపటి గ్రా మంలో బట్టుగూడ ముత్యాలమ్మ బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పండాలని మొక్కుకున్నారు.

## గోదాదేవికి ఆషాడం సారె

మఠంపల్లి : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి మాత, గోదాదేవికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం ఆషాడం సారె సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు సమృద్ధిగా కురువాలని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న బొడ్రాయికి నీళ్లతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, చిన్నరామారావు, రాధాకృష్ణమూర్తి, కాంతారావు , సత్యనారాయణ, ఆంజనేయులు, సంధ్యారాణి, భూలక్ష్మి, శ్యామల, పద్మావతి, స్వాతి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059


గరిడేపల్లి : గడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


హుజూర్‌నగర్ : గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

# పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గరిడేపల్లి, జూలై 14 : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్‌లో 2000– 01 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాపకాలను నెమరవేసుకొని, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. నాటి గురువులు రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, వీరారెడ్డి, అనంతయ్య, మధు, బుచ్చిరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగేశ్, సైదులు, రాంబాబు, ప్రసాద్, నాగరాజు, స్రవంతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- హుజూర్‌నగర్ : స్థానిక ఎన్ఎస్పీ ఉన్నత పాఠశాలలో 1992లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయుడు ముదుంబా రామకృష్ణాచార్యులు, ఉపాధ్యాయులు అనంతరాయశర్మ, నర్సయ్య, యతిపతిరావు, మంగయ్య, వాసిరెడ్డి, విద్యార్థులు శ్రీనివాస్, ఫణింధర్, హుస్సేన్, రవికుమార్, కిరణ్ , రాజశేఖర్‌రెడ్డి, జానకి రాములు, మీరా పాల్గొన్నారు.
- బొడ్రాయిబజార్ : జిల్లా కేంద్రంలోని మొరిశెట్టి అంతయ్య మెమోరియల్ (ఎంఏఎం)లో 1988–89లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక త్రివేణి ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. 35 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో నాటి గురువులు ముత్తయ్య, నర్సయ్య, పూర్వ విద్యార్థులు అఫ్సర్, పద్మ, శ్రవణ్‌కుమార్, వి.ఉపేందర్, గోళ్ల శ్రీనివాస్, గండూరి రమేశ్ తదితరులున్నారు.


సూర్యాపేటలో సమావేశమైన ఎంఏఎం పూర్వ విద్యార్థులు